

దేవుళ్ల చిత్రపటాలు ఉన్న టపాసులను కాల్చొద్దు : వీహెచ్‌పీ

కామారెడ్డి టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ రోజున దేవుళ్ల చిత్రపటాలు ఉన్న టపాసులను కాల్చవద్దని వీహెచ్‌పీ నాయకులు స్వామి, వంగ ప్రసాద్, విశ్వంగుప్తాలు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్ష్మీదేవి ప్రసన్నం కోసం ఎంతో భక్తిశ్రద్ధలతో పూజిస్తామని అలాంటి దేవత ఫొటోలతో ఉన్న టపాసులను కాల్చి రోడ్డుపై చిందరవందరగా పడడంతో కాలితో తొక్కుతూ వెళ్తారని తెలిపారు. మన దేవతలను మనమే అవమానించుకోవడం తగదని అన్నారు.



ఆవులను విడిపిస్తున్న భజరంగ్‌దళ్ సభ్యులు

అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత

భిక్కనూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అక్రమంగా కంటైనర్ లారీలో ఆవులను తరలిస్తుండగా భిక్కనూరు బీజేపీ, భజరంగ్‌దళ్ సభ్యులు, స్థానిక యువకులు భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ వద్ద అడ్డుకున్నారు. ఈ సందర్భంగా (మిగతా 8వ పేజీలో)




నేటితో ముగియనున్న మద్యం దుకాణాల టెండర్ల గడువు

- చివరి నాలుగైదు రోజుల్లో పెరుగుతున్న దరఖాస్తులు
- గత మూడు రోజులుగా 833 దరఖాస్తులు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైన్‌షాపుల లైసెన్స్ కోసం పోటీ పెరుగుతుంది. శనివారంతో మద్యం టెండర్లకు గడువు ముగియనుంది. జిల్లాలో 49 వైన్‌షాపులకు గత మూడు రోజులుగా మొత్తం 833 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎక్సైజ్‌శాఖ అధికారులు తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తయిన అనంతరం లైసెన్స్‌లు లాటరీ పద్ధతిలో కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు. చివరి తేదీ సమీపిస్తుండడంతో గత నాలుగైదు రోజులుగా ఎక్సైజ్ కార్యాలయాలు అభ్యర్థులతో కిటకిటలాడాయి. మొదట్లో నెమ్మదిగా సాగిన ప్రక్రియ ఊపందుకుంది. గతంలో మాదిరిగా దరఖాస్తులు రాలేదని తెలుస్తుంది. శనివారం దరఖాస్తుల సంఖ్య మరింత పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కామారెడ్డిలో మొత్తం 15 వైన్‌షాప్‌లకు 240 దరఖాస్తులు, దోమకొండలో మొత్తం 8 వైన్‌షాప్‌లకు 172, ఎల్లారెడ్డిలో 7 వైన్‌షాప్‌లకు 154, బాన్సువాడలో 9 వైన్‌షాప్‌లకు 131, బిచ్‌కుంద 10 వైన్‌షాప్‌లకు 131 దరఖాస్తులు వచ్చాయన్నారు. కాగా జిల్లాలో 49 వైన్‌షాప్‌లకు 833 దరఖాస్తులు వచ్చాయని అధికారులు వివరించారు.

నాగమడుగుపై.. కమీషన్ల పడగ



నిర్మాణం నిలిచిపోయిన నాగమడుగు ఎత్తిపోతల పథకం ఇదే..

- ఖద్దర్ ముసుగులో కాసుల వేట
- నియోజకవర్గ స్థాయి ప్రతినిధికి కుదరని డీల్
- 20-30 శాతం ఇవ్వాల్సిందే అని నిర్మాణ సంస్థకు హుకూం
- అప్పట్లో ముఖ్యమంత్రి వరకు వెళ్లిన వ్యవహారం
- ఇసుక లభించకుండా చేయడంతో పనులకు బ్రేక్
- ఐదేళ్లు గడిచినా ముందుకు సాగని నాగమడుగు ఎత్తిపోతల పథకం

జుక్కల్ నియోజకవర్గంలో ఖద్దరు మాటున కాసుల కలెక్షన్ కొనసాగుతోంది. కాసుల బేరం కుదిరితేనే గ్రీన్‌సిగ్నల్ లభిస్తుంది. లేదంటే కాంట్రాక్టర్లకు పనులు నిలిపివేయాలని హుకూం జారీ చేస్తున్నారు. నియోజకవర్గస్థాయి ప్రజా ప్రతినిధి జారీ చేస్తున్న హెచ్చరికలతో అభివృద్ధి పనులు చేయడానికి జంకుతున్నారు. పూర్తయిన పనులకు బిల్లులు రావాలన్నా సదరు ఘనాపాటితో ములాఖత్ తప్పనిసరి. లేదంటే అప్పుల పాలు కావాల్సిందే. అర్ధాంతరంగా నిలిచిపోయి వెక్కిరిస్తున్న నాగమడుగు ప్రాజెక్టు పనులు దీనికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి.



నిజాంసాగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్‌గల్‌లో సిరులు పండించాలనే లక్ష్యంతో నిజాంసాగర్ నాన్ కమాండ్ ఏరియాలో రూ.476 కోట్ల వ్యయంతో నాగమడుగు ఎత్తిపోతల పథక నిర్మాణానికి 2021లో అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఐదేళ్లు గడుస్తున్నా ఈ పనులు ముందుకు సాగటం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 22 నెలలు గడుస్తున్నా అడుగులు ముందుకు పడటం లేదు. ఇప్పటి వరకు కేవలం 15 శాతం పనులు మాత్రమే జరిగాయి. 13 శాతం రికార్డయి నిర్మాణాలకు బిల్లులు చెల్లించారు. సెగ్మెంట్ బాస్ బ్రేకులు వేస్తుండటంతో ఎత్తిపోతల ఉత్తిపోతలగానే మిగిలింది. నాగమడుగు ప్రాజెక్టుకు సంబంధించి పురోగతి లేకపోవడానికి పెద్దన్న పాత్ర పోషిస్తున్న వ్యక్తే (మిగతా 8వ పేజీలో)



ఏఎస్పీ నర్సింహారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలి

- డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం ఏఎస్పీ నర్సింహారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి కల్వకుంట్ల తారక రామారావు, బీఆర్ఎస్ పార్టీ సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డిపై సామాజిక మాధ్యమాల ద్వారా ఉద్దేశ్యపూర్వకంగా అనుచిత వ్యాఖ్యలు, దుషణాత్మకమైన పోస్టులు చేస్తున్నారని అన్నారు. పోస్టుల్లో నిరాధార ఆరోపణలు, అసభ్య పదజాలం, ప్రజలను తప్పుదారి పట్టించే కథనాల ద్వారా సీఎం ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పండ్ల రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్

భిక్కనూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పాఠశాల పరిసరాలను, తరగతి గదులను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం భిక్కనూరు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. తరగతి గది శుభ్రంగా లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు స్వయంగా పాఠాలను బోధించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సరైన జవాబు చెప్పిన విద్యార్థులకు నోట్‌బుక్కులను అందజేశారు. ఇస్రో సందర్శనకు ఎంపికైన విద్యార్థులతో మాట్లాడి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, తహసీల్దార్ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.



భిక్కనూరు పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

వరి పంట మద్దతు ధర పోస్టర్ ఆవిష్కరణ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం వరి పంట మద్దతు ధర పోస్టర్‌ను శుక్రవారం కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టర్‌ను ప్రతీ కొనుగోలు కేంద్రంలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, పౌర సరఫరాలశాఖ డీఎం శ్రీకాంత్, డీసీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పెచ్చుమీరుతున్న పేకాట

- వ్యసనంగా మారుతున్న వైనం
- పెరుగుతున్న అప్పుల భారం
- కుటుంబాల్లో తరచూ గొడవలు
- పోలీసులు ఉక్కుపాదం మోపాలని విన్నపం

8

మరుగుదొడ్లు లేవు.. తాగునీరు రాదు

- కండేబల్లూర్ పాఠశాలలో విద్యార్థుల అవస్థలు
- ఆగిపోయిన అదనపు తరగతుల నిర్మాణాలు



7



నాగిరెడ్డిపేటలో ధాన్యం తేమ శాతంను పరిశీలిస్తున్న డీసీవో రామ్మోహన్

427 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

- డీసీవో రామ్మోహన్

నాగిరెడ్డిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లాలో 427 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా సహకార శాఖ అధికారి (డీసీవో) రామ్మోహన్ తెలిపారు. ఆయన శుక్రవారం మండలంలోని తాండూర్, మాల్తుమ్మెద సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. మండలంలోని నాగిరెడ్డిపేట, గోలిలింగాల్, లింగంపల్లి, మాల్తుమ్మెద, తాండూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలిస్తున్న రైతులతో ఆయన మాట్లాడారు. కొనుగోలు (మిగతా 8వ పేజీలో)



మాట్లాడుతున్న రాజ్‌పాల్ కరోల

డీసీసీ అధ్యక్ష పదవికి అభిప్రాయాల సేకరణ

మహమ్మద్‌నగర్ అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్ష పదవికి నామినేషన్ల పర్వం కొనసాగుతుంది. ఎనిమిది మండలాల నియోజకవర్గ కార్యకర్తల అభిప్రాయ సేకరణలో భాగంగా శుక్రవారం నిజాంసాగర్ మండల కేంద్రంలో గుల్‌గుస్తా ప్రాంగణంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐసీసీ అబ్జర్వర్ రాజ్‌పాల్ కరోల హాజరు కాగా ఆయనకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓట్ చోర్ గద్దె చోడ్ సిగ్నేచర్ కంపెనీ నిర్వహించినట్లు తెలిపారు. దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓట్ చోర్ ద్వారా గద్దెనెక్కి కూర్చున్నారని మండిపడ్డాడు. ఏ మాత్రం దేశంపై అభిమానం ఉన్నా ప్రధానమంత్రి గద్దె దిగాలన్నారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిగ్నేచర్ క్యాంపైన్‌ను ఏర్పాటు చేసి కార్యకర్తల సంతకాలను సేకరించి అధిష్ఠానానికి పంపుతున్నట్లు తెలిపారు. పార్టీలో కష్టపడ్డ వారికి ప్రాధాన్యత ఉంటుందని, కార్యకర్తల అభిప్రాయాల మేరకే డీసీసీ అధ్యక్ష పదవి వరిస్తుందన్నారు. అనంతరం జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావు మాట్లాడుతూ అధిష్ఠానం చూపించిన విధంగా డీసీసీ అధ్యక్ష పదవి కొనసాగుతుందని, గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి కార్యకర్తల అభిప్రాయం మేరకు డీసీసీ ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి నిబద్ధత కలిగిన నాయకుడికే డీసీసీ పదవి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ గుప్తా, నిజాంసాగర్ మండల అధ్యక్షుడు ఏలే మల్లిఖార్జున్, పిట్ల ఏఎంసీ చైర్మన్ మనోజ్‌కుమార్, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఇమ్రోజ్, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను క్లియర్ చేయాలి

- ఎస్పీ రాజేష్‌చంద్ర



కామారెడ్డి టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సాధ్యమైనంత త్వరగా పెండింగ్ కేసులను క్లియర్ చేయాలని ఎస్పీ రాజేష్‌చంద్ర అన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన నెలవారి సమీక్షలో అయన అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పూర్తి పారదర్శక దర్యాప్తు జరగాలని, కేసు నమోదు నుంచి చార్జిషీటు వరకు ప్రతీ అంశాన్ని కూలంకుశంగా పరిశీలించి ఫైనల్ చేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజలకు అందుబాటులో ఉండి సత్వర న్యాయం చేయాలని తెలిపారు. ఓపెన్ డ్రింకింగ్, గ్యాంబ్లింగ్, గేమింగ్, మట్కా వంటి అక్రమ కార్యకలాపాలను కఠిన చర్యలతో రూపుమాపాలని ఆదేశించారు. ఫేక్ నెంబర్‌ప్లేట్లు, నెంబర్ ప్లేట్ల మార్పులపై తనిఖీ చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోవాలని బాణాసంచా కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. జూదం ఆడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాణసంచా.. జీరో దందా!





కామారెడ్డిలో ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాలు

- అనుమతులు లేకుండానే టపాకాయల వ్యాపారం
- జనావాసాల్లోనే దుకాణాల ఏర్పాటు
- నిబంధనలు పాటించని దుకాణాలపై తనిఖీలు శూన్యం
- రెండు, మూడు దుకాణాలకు మాత్రమే అనుమతులు
- మామూళ్ల మత్తులో సంబంధిత శాఖాధికారులు
- ఇష్టారాజ్యంగా ధరలు.. ప్రభుత్వ ఖజానాకు గండి

కామారెడ్డి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో టపాకాయల వ్యాపారమంతా జీరో దందాగానే కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా ధరలు వేసి విక్రయదారుల జేబులను కొల్లగొడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేయడమే కాకుండా పెద్ద మొత్తంలో బాణాసంచా మాల్‌ను జిల్లాకు తీసుకువస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం సైతం గండికొడుతున్నారు. ఇదిలా ఉండగా టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేయాలంటే కఠినమైన నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. అయితే వ్యాపారులు అవేవి ప్రమాణాలు పాటించకుండా జనావాసంలోనే స్టాళ్లను ఏర్పాటు చేస్తు విక్రయిస్తున్నారు. ఏదైన జరగరాని సంఘటన జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు. అక్రమ వ్యాపారంపై, నిబంధనలు పాటించని దుకాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అగ్నిమాపక, పోలీసు, వాణిజ్య పన్నుల, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూడరు. ఏదో దీపావళి పండుగ వచ్చిందనే కారణంగా రెండు, మూడు దుకాణాలకు మాత్రమే అనుమతులు ఇస్తున్నారు. కానీ పదుల సంఖ్యల్లోనే స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. వ్యాపారులు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ ఇష్టారాజ్యంగా ధరలను పెంచి విక్రయిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

అనుమతులకు తిలోదకాలు

దీపావళి పండుగ వచ్చిందంటే చాలు టపాకాయల వ్యాపారం జిల్లాలో కోట్లలోనే సాగుతోంది. అయితే టపాకాయల నిల్వలపై ఆయా శాఖల అధికారులు నిఘా పెట్టడం లేదు. అనుమతులు లేకుండా చాలా చోట్ల బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పండుగ సమయంలోనే కాకుండా ఇతర సమయాల్లోనూ పలు గోదాంలలో పెద్ద మొత్తంలోనే పేలుడు పదార్థాలను విచ్చలవిడిగా నిల్వ చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద మున్సిపాలిటీల్లోనూ టపాకాయల వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాణాసంచా దుకాణం ఏర్పాటు చేయాలంటే ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు చేయడంతో పాటు జనావాసాల్లో ఉండరాదు. అయితే జిల్లాలో మాత్రం రద్దీగా ఉండే ప్రాంతాల్లోనే ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకవేళ టపాకాయల దుకాణం ఏర్పాటు చేసినా ఏదైన ప్రమాదం జరగకుండా ఫైర్‌సేఫ్టీ సిలిండర్‌లు, నీళ్లు, ఇసుక, డీసీపీ సరిపడ ఉంచాల్సి ఉండగా ఎక్కడ అమలు కావడం లేదు.

ధరలు ఇష్టారాజ్యం.. ఖజానాకు ఎగనామం

బాణాసంచా వ్యాపారులు అంతా బ్లాక్‌లోనే సరుకును దిగుమతి చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. వ్యాపారం ఇష్టారీతిన ధరలు నిర్ణయించి విక్రయిస్తూ వినియోగదారుల జేబులు గుళ్ల చేస్తున్నారు. రూ.5 విలువ చేసే (మిగతా 8వ పేజీలో)

క్రైం సమాచారం

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

పెద్దకొడప్‌గల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపూర్ చెరువులో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జారి పడి మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. కాస్లాబాద్ గ్రామానికి చెందిన పిసికె సాయిలు (50)కు భార్యతో విడాకులు కావడంతో తన తమ్ముడు లింగయ్య వద్ద ఉంటున్నాడు. ఈనెల 15న కాస్లాబాద్‌లో తమ్ముడి ఇంటివద్ద భోజనం చేసిన సాయిలు సీతాఫలాల కోసమని ఇంటినుంచి బయల్దేరినట్లు లింగయ్య తెలిపారు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో లింగయ్యతోపాటు గ్రామస్థులు సాయిలు కోసం గాలించారు. శుక్రవారం ఉదయం బేగంపూర్ శివారులోని చెరువు వద్ద సాయిలు మృతదేహం ఉన్నట్లు గుర్తించిన బంధువులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. మృతుడు సాయిలుకు కళ్లు సరిగా కనిపించవని, చెరువులోకి దిగి మృతిచెంది ఉంటాడని లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో బాలుడి మృతి



మృతిచెందిన సయ్యద్ చోటు

నాగిరెడ్డిపేట,అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో ఓ బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామశివారులో శుక్ర వారం ఉదయం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై భార్గవ్‌గౌడ్ వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా రామసముద్రం గ్రామానికి చెందిన సయ్యద్ చోటు (16) కొంతమంది గ్రామస్థులతో కలిసి బాతులు మేపడానికి నాగి రెడ్డిపేట గ్రామానికి వచ్చారు. శుక్రవారం ఉదయం సయ్యద్ చోటు గ్రామ శివారులోని పోచారం కెనాల్ పక్కన బాతులను మేపడానికి వెళ్లా డు. బాతుల మందాలోని కొన్నిబాతులు పొలాల్లోకి వెళ్లగా వాటిని మళ్లిం చడానికి పొలంవైపు వెళ్లిన సయ్యద్ చోటు పొలలో ఉన్న స్టార్టర్ బాక్సు వద్ద విద్యుత్ వైరుకు తగిలి మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి ముంతాజ్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

385 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మాక్లూర్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి గ్రామ శివారులో గల రైస్‌మిల్లులో శుక్రవారం రాత్రి 385 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మామిడిపల్లి శివారులో గల వైభవ్ వేంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్లులో రేషన్ బియ్యం ఉన్నట్లు వచ్చి పక్కా సమాచారంతో స్పెషల్ బ్రాంచి సిబ్బందితో అక్కడికి వెళ్లి తనిఖీలు చేశారు. ఐచర్‌వ్యాన్‌లో సుమారు 127 క్వింటాళ్ల బియ్యం, మిల్లులో సుమారు 257 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. ఐచర్ వ్యాన్ డ్రైవర్ మహ్మద్ సోహెల్, వాహనయజమాని, మదనం ఎల్లయ్య, రైస్‌మిల్లు యజమాని నల్లమూతు నగేష్, ఆపరేటర్ బాలాజీపైన డిప్యూటీ తహసీల్దార్, సివిల్ సప్లైయ్ ఆఫీస్, నిజామాబాద్ వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బోధన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శక్కర్‌నగర్ సమీపంలో గల సాత్‌పుల్ వద్ద వేగంగా వస్తున్న కారు స్ప్రింగ్ బేకరీ వద్ద ఆగి ఉన్న భార్యభర్తలతో పాటు అక్కడే ఉన్న ఓ బైకును ఢీకొట్టింది. ప్రమాదంలో ఆకాష్, శ్వేతలకు గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుందని, కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన నలుగురికి జైలు

ఎల్లారెడ్డిరూరల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన నలుగురికి ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి సుష్మ ఒక రోజు జైలుశిక్ష విధించినట్లు ఎస్సై మహేష్ శుక్రవారం తెలిపారు. జైలు శిక్షతోపాటుగా రూ.1100 జరిమానా విధించినట్లు చెప్పారు.

గవాయ్‌పై దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ధర్నా

నవీపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. న్యాయమూర్తిపై దాడిచేసిన వ్యక్తిపై వెంటనే కేసునమోదు చేసి అతనిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దాడిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, కుమార్, గోపి, వెంకట్, కృష్ణ తదితరులున్నారు.

మెండోర: సుప్రీం కోర్టు న్యాయమూర్తిపై దాడి చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మాకురి మహేష్ మాదిగ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండిస్తూ నిరసన తెలిపి తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు గుంటి నిశాంత్ మాదిగ, నాయకులు దుమ్మడి సాయన్న మాదిగ, ముత్తెన్న, రాజన్న, తదితరులున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



గొట్టుముక్కులలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మాక్లూర్, అక్టోబ రు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించిన పంటలను ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారానే విక్రయించు కో వాలని దళారులను నమ్మి మోసపోవద్దని చైర్మన్ బూరోల్ల అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని గొట్టు ముక్కుల, ముల్లంగి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవిప్రకాష్, సంఘ కార్యదర్శి ప్రవీణ్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

డొంకేశ్వర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శివాలయ శ్రీ రాజరాజేశ్వర స్వామి విగ్రహ, శిఖర, ప్రతిష్ఠాపన పూజకార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గడిచిన మూడు రోజులుగా వేద పండితులు విశేష హోమాలు ప్రాణ ప్రతిష్ట నిర్వహించారు. ప్రతిష్ట సందర్భంగా ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు.



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న సంఘం సభ్యులు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

నందిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామంలో శుక్రవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం క్వింటాలు మొక్కజొన్న ధాన్యంకు రూ2400 చెల్లిస్తామని ఖుద్వాన్‌పూర్ సొసైటీ చైర్మన్ వాకిడి కార్తీక్ రెడ్డి, ఆర్మూర్ నియోజక వర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బైండ్ల ప్రశాంత్ పేర్కొన్నారు. మొక్కజొన్న రైతులు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ తోట మహేష్, సీఈవో చిన్నయ్య, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మురళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగ్లారపు తుక్కన్న, రైతులు, సొసైటీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలి

బోధన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శుక్రవారం బోధన్ మండలంలోని సంగెం, భవానీపేట్ కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో రైతులకు తాగునీరు, గన్నీబ్యాగులు, లారీలు, మాయిశ్చర్ మీటర్లు, వేయింగ్ మిషన్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రైతుల రికార్డుల నిర్వహణ ప్రతి రైతు యొక్క సిరియల్ నెంబర్‌ను రికార్డు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో హమాలీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

ప్రతీలారీ పంపినప్పుడు ట్రాక్‌షీట్‌ను తయారు చేయాలన్నారు. రైస్‌మిల్లులతో అనుసంధానం చేసి పంపిన వారికి సంబంధించిన రసీదులు పొందడానికి రైస్‌మిల్లులతో క్రమంతప్పకుండా ఫాలోఫ్‌చేయాలన్నారు. డివిజన్‌లోని తహసీల్దార్లు సొసైటీ సీఈవోలతో సమన్వయం చేసుకుంటూ రోజువారి పీసీసీ వారిగా డేటా నిర్వహించాలని ఆదేశించారు.

నవీపేటలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవీపేట: నవీపేట సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ సొసైటీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ కే.రమావతి సొసైటీ కార్యదర్శి మహేష్, మోస్రా సాయిరెడ్డి, ప్రసన్నకుమార్, సంజీవరెడ్డి, గణేష్, రాము, గంగాధర్ ఉన్నారు.

అనుమతి లేని ప్రార్థనా మందిరాన్ని తొలగించాలి

నవీపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాజీ చౌక్ సమీపంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రార్థన మందిరాన్ని తొలగించాలని కోరుతూ పలువురు కాలనీవాసులు, నాయకులు పోలీసులతో పాటు పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. సంబంధిత ప్రార్థన మందిరం ఏర్పాటుతో తాము ఇబ్బందులు పడుతున్నామని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు అందజేసిన వారిలో పరశురాం గౌడ్, రాజేందర్ గౌడ్, గణేష్, రాము, కృష్ణ తదితరులున్నారు.

బోధన్-గాంధారి బస్సు నడపాలి

వర్ని, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బోధన్ ఆర్టీసీ డిపో నుంచి కామారెడ్డి జిల్లా గాంధారి వరకు రాత్రి పూట బస్సును నడపాలని పీసీసీ డెలిగేట్ రాజిరెడ్డి కోరారు. శుక్రవారం బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఇదేమార్గంలో బడా పహాడ్ పుణ్యక్షేత్రం కలదని తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు రాకపోకలు కొనసాగిస్తారని పేర్కొన్నారు. రాత్రివేళల్లో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తుచేశారు. మార్గంలో బస్సువేస్తే కామారెడ్డి, హైదరాబాద్ వెళ్లే వారికి సౌకర్యంగా ఉంటుందని గుర్తుచేశారు.

ముగ్గురు పిల్లలున్నా ఎన్నికల్లో పోటీకి అవకాశం హర్షనీయం

ఆర్మూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు కలిగిన తల్లిదండ్రులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించడం హర్షనీయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఇట్టడి లింగారెడ్డి అన్నారు. ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

నేటి బీసీ బంద్‌ను జయప్రదం చేస్తాం

» మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

వర్ని, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు శనివారం తలపెట్టిన బీసీ బంద్‌ను జయప్రదం చేస్తామని బాన్సువాడ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవ ర్ధన్ స్పష్టం చేశారు. శుక్రవారం వర్నిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట అన్ని రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టి 42శాతం రిజర్వేషన్ అమలు పేరుతో నాటకాలు ఆడి చివరకు బీసీ బిడ్డల గొంతు కోశారని ఆయన విమర్శించారు. హై కోర్టు, సుప్రీం కోర్టు ఆదేశాలు బేఖాతరు చేసి ఇంకా 42శాతం రిజర్వేషన్ పేరుతో సీఎం జిమ్మిక్కులు ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ కోసం పోరాడుతామని కాంగ్రెస్ పార్టీ ఓట్ల రాజకీయాన్ని తొక్కిపెట్టి బీసీ బంద్‌ని జయప్రదం చేస్తామని సీనియర్ నేత యలమంచిలి శ్రీనివాస్‌రావు తెల్పి చెప్పారు. సమావేశంలో వంగా శ్రీనివాస్ రావు, తెళ్ళ రవికుమార్, గంగాప్ప, మాధవ రెడ్డి, ఆసీఫ్, ఏజాజ్, పాల్గొన్నారు.

బాజిరెడ్డి పరామర్శ

వర్ని: మండలంలోని తగిలేపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి బక్క ఆనంద్ స్వరూప్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం తగిలేపల్లికి చేసుకున్నారు. మృతుడి తండ్రి బక్క భాస్కర్‌ను పరామర్శించారు. బాజిరెడ్డి వెంట నాయకులు యలమంచిలి శ్రీనివాస్ రావు, బక్క నారాయణ, గుజ్జ అశోక్, చింతం రమేష్, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ మద్దతు

పెర్కిట్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంశంలో బీసీ సంఘాలు ఇచ్చిన నేటి బంద్‌కు ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలో యాజమన్యాలు ఆర్మూర్ మండల ట్రస్మా అధ్యక్ష కార్యదర్శులు భరత్‌చంద్ర



మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

మల్లయ్య, విద్యా ప్రవీన్ పవార్, కోశాధికారి స్కాలర్స్ వేణు, రాష్ట్ర ప్రతినిధి కాంతి గంగారెడ్డి, నలంద ప్రసాద్, సాగర్ తెలిపారు.

మద్దతు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

జక్రాన్‌పల్లి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం జరిగే రాష్ట్ర బందుకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. శుక్రవారం జక్రాన్‌పల్లిలో బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ కుంచాల విమల రాజు, నాయకులు మాట్లాడారు. బంద్‌కు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా నేడు చేపట్టిన తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంఘాల ప్రతినిధులు సీపీఐఎంఎల్ ప్రజా పంథా పార్టీ, అధికార ప్రతిపక్ష రాజకీయ పార్టీలు పాల్గొని మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై రాజకీయ డ్రామాలు ఆపి 9వ షెడ్యూల్‌లో చేర్చి 42 శాతం రిజర్వేషన్‌లతోను స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ ప్రజా పంథా పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి వి. ప్రభాకర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అంజనేయులు, ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాజశేఖర్, సీపీఐఎంఎల్ డివిజన్ కార్యదర్శి బి. దేవరాం నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ ఎడారిలో చిక్కుకున్న సిద్దపల్లి గ్రామవాసి

● సీఎం ప్రవాసి ప్రజావాణిని ఆశ్రయించిన కుటుంబ సభ్యులు

భీమ్‌గల్ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెజ్జోన గ్రామ పంచాయితీ పరిధిలోని సిద్దపల్లి గ్రామానికి చెందిన భోజ సురేష్ అనే యువకుడు గల్ఫ్ ఏజెంట్ చేసిన మోసానికి మస్కట్ దేశంలో ఎడారిలో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నాడు. భోజ సురేష్ ను రక్షించి ఇండియాకు తీసుకురావాలని అతని కుటుంబ సభ్యులు శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం ప్రవాసి ప్రజావాణిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎన్నారై అడ్వైజరి కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి పేరిట వినతి పత్రం సమర్పించారు. పూర్తి వివరాల ప్రకారం బోజ సురేందర్ 2025 సంవత్సరం ఆగస్టు 20న మస్కట్‌కు వెళ్లాడు. ఏజెంట్ ఇక్కడ కంపెనీ లో క్లీనర్ పని అని చెప్పి మస్కట్ ఎడారిలో గొర్రెల కాపరిగా పెట్టారని, దీంతో ఆయన ఇబ్బందులు పడుతున్నాడు. ఒమాన్ రాజధాని మస్కట్ కు 250 కిలో మీటర్ల దూరంలోని యంకుల్ అనే పట్టణంలోని ఎడారి ప్రాంతంలో గొర్రెలను మేపుతూ, విపరీతమైన పని ఒత్తిడి, ఎడారి వాతావరణం తట్టుకోలేక పోతున్నానని సురేష్ కుటుంబ సభ్యులకు తెలిపారు. ఇటీవల సురేష్ తల్లి చనిపోయిన అంత్యక్రియలకు ఇండియాకు పంపమని బ్రతిమిలాడిన ఇండియాకు రావడానికి అనుమతి ఇవ్వలేదని, ప్రస్తుతం అతని



ప్రవాసి ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న కుటుంబ సభ్యులు



మస్కట్ ఎడారిలో చిక్కుకున్న సురేష్

భార్య అనారోగ్యంతో బాధపడుతున్నదని తన ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుందని ఎలాగైనా ఇండియాకు తిరిగి పంపాలని సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశాడు. సురేష్ ను ఇండియాకు రప్పించాలని వినతి పత్రం అందజేయగా ఇండియా ఏమిగ్రాంట్స్ వెల్ఫేర్ ఫోరమ్ ప్రధాన కార్యదర్శి బీఎల్ సురేంద్రనాథ్, ప్రజావాణి సిబ్బంది జగదీష్ పటేల్, టాంకాం ప్రతినిధి పవన్ సురేష్ కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

వరి కోతలో మెళకువలు పాటిస్తే నాణ్యత గల ధాన్యాన్ని పొందవచ్చు

జక్రాన్‌పల్లి , అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వరి కోతలో నిర్ధేశించిన పద్దతులు పాటిస్తే నాణ్యత గల ధాన్యాన్ని పొందవచ్చని తహసీల్దార్ కిరణ్మయి, వ్యవయాధికారిణి దేవిక అన్నారు. శుక్రవారం జక్రాన్‌పల్లిలోని రైతు వేదికలో వరికోత మిషన్ యజమానులకు, డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. వరి కోతలో అధికారులు నిర్ధేశించిన పద్దతుల పాటిస్తే తాళు, మట్టి పెల్లలు, గడ్డి లేకుండా గ్రేడ్ 1 నాణ్యతగల ధాన్యాన్ని పొందవచ్చని స్పష్టం చేశారు. రైతులు వరి కోతకు వచ్చినప్పుడే కొయ్యాలని పచ్చగా ఉన్నప్పుడు కోయొద్దని వరి ఎండిపోయి కోతకు వచ్చినప్పుడే వరి కోతను కోయాలని రైతులకు సూచించారు. వరి పచ్చిగ ఉన్నప్పుడు కోతలు కోస్తే పంట దిగుబడి తగ్గుతుందన్నారు. వరికోతలలో అధికారులు ఇచ్చిన సలహాలు, సూచనలు పాటిస్తే నాణ్యమైన ధాన్యం వస్తుందని దీంతో కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని విక్రయించుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో సొసైటీ సీఈవోలు, వరికోత యజమానులు, ఏఈవోలు, జీపీవోలు, రైతులు పాల్గొన్నారు.

పంటను కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలి

● డీఎస్‌వో శ్రీనివాస్ రావు

కమ్మర్‌పల్లి, అక్టోబరు 17: (ఆంధ్రజ్యోతి) రైతుల సౌకర్యార్థం ప్రభుత్వ ఏర్పాటు చేన ధాన్యంకొనుగోలు కేంద్రలలో తమ పంటలను విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని డిఎస్‌వో శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లి సహకార సంఘ భవనంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాని ఆయన ప్రారంభించారు. కేంద్రానికి వచ్చిన రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్త కుండా చూడాల్సిన బాధ్యత కేంద్రాల నిర్వహకులదేనన్నారు. లారీల కొరత, గన్ని బ్యాగుల కొరతలు రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులు తమ పంటలను కేంద్రాలకు తరలించాలని మొక్కజొన్న తేమ శాతం14 కు మించకుండా నాణ్యత ప్రమానాలు పటించాలని ప్రభుత్వ కనీసమద్దతు ధర క్వీంటాలుకు 24వందలు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, డైరెక్టర్ మహేందర్, ఏవో రమ్యశ్రీ, నాయకులు బుచ్చిమల్లయ్య, నిమ్మరాజేంద్ర ప్రసాద్ గణేష్ గౌడ్, కిషన్ గౌడ్, బద్దం రాజేష్, మాజీ ఎంపీపీ గుడిసె అంజమ్మ, కార్యదర్శి శంకర్, సిబ్బంది రైతులు ఏఈవోలు పాల్గొన్నారు.

స్వచ్ఛ తెలంగాణ ప్రతిజ్ఞ



పెర్కిట్ లో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

పెర్కిట్ , అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత పక్షోత్సవాలలో శుక్రవారం విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి స్వచ్ఛ తెలంగాణ ప్రతిజ్ఞ చేయించారు. పెర్కిట్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ర్యాలీలో పాల్గొని పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు.

క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు

పెర్కిట్ ,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో క్రీడలలో గెలుపొందిన జడ్పీహెచ్ఎస్ పెర్కిట్ తెలుగు మీడియం విద్యార్థులను విడిసి సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజ గంగారాం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మున్ను పాల్గొన్నారు. మండల స్థాయిలో అండర్ -17 బాలుర కబడ్డి పోటీలలో ద్వితీయ బహుమతి, మార్చ్‌ఫాస్ట్‌లో ప్రత్యేక బహుమతి, అండర్ -14 బాలుర కబడ్డిలో ద్వితీయ బహుమతి పొందిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

బాణసంచాల దుకాణాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి

జక్రాన్‌పల్లి , అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో తాత్కాలిక బాణసంచాల దుకాణాల ఏర్పాటు కోసం తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్సై ఎండి మాలిక్ రహ్మాన్ తెలిపారు. గ్రామాలలో తాత్కాలిక బాణ సంచాల దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా నిజామాబాద్ డివిజన్ లోని ఏసీపీ వద్ద అనుమతి తీసుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కలిగోట్ విద్యార్థిని ఎంపిక



జక్రాన్‌పల్లి , అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ -17 వాలీబాల్ పోటీలకు మండలంలోని కలిగోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్ ప్రణతి ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు యాదగిరి తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా తిమ్మాపూర్‌లో శనివారం నుంచి 20వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో విద్యార్థిని ప్రణతి పాల్గొంటుందని తెలిపారు.

గుంతలను పూడ్చాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

నవీపేట, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో పలుచోట్ల రోడ్డుపై భారీ గుంతలు పడ్డాయని, వాటిని పూడ్చాలని గ్రామస్థులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. వీటిపై అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని అన్నారు. గుంతలలో అధికారులు కంకర పౌడర్ వేయడంతో దుమ్ము, ధూళితో తాము ఇబ్బందులు పడుతున్నామంటూ ముఖానికి మాస్క్ ధరించి రాస్తారోకోలో చేశారు. భైంసా నుంచి నవీపేటకు వస్తున్న తహసీల్దార్ వెంకటరమణ రాస్తారోకో చేస్తున్నవారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. అనంతరం గ్రామస్థులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పోతంగల్ పంచాయతీ కార్యదర్శిని తొలగించాలి

కోటగిరి, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్‌ను విధుల నుంచి తొలగించాలని గ్రామస్థులు పోతంగల్ బస్టాండ్ వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. స్థానికులు మాట్లాడుతూ తాగునీటి, పారిశుధ్య సమస్యలపై పట్టించుకోవడం లేదన్నారు. కార్యాలయానికి వెళ్తే డబ్బులు తీసుకోనిదే ఏ పని జరగడం లేదని ఆరోపించారు. పంచాయతీలో ఉన్నపాత వస్తువులకు వేలం వేయకుండా, నోటీసులు ఇవ్వకుండా అమ్మేశారన్నారు. అనంతరం ఎంపీడీవో చందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు హన్మాండ్లు, శేఖర్, హైమద్, సాయిలు, గంగారాం, నవీన్, రాము, లక్ష్మణ్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

బోధన్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని అమ్దాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం 108 సిబ్బంది విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 108 సిబ్బంది లక్ష్మణ్, కేశవ్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: కళ్ల ముందు అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వ్యక్తికి సిపిఆర్ చేసి ప్రాణాలను కాపాడవచ్చు అని డొంకేశ్వర్ మండల వైద్యాధికారి శుభాకర్ అన్నారు. డొంకేశ్వర మండలంలోని తొండాకూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వెంకటేష్, వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయుడు లింగారెడ్డి, సూర్ వైజర్ సురేందర్ పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

నవీపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని కోరుతూ సీపీఎం, కేవీపీఎస్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం మండలకేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. బీసీలకు రిజర్వేషన్‌ల అమలు విషయంలో బీజేపీ ద్వంద వైఖరి సరికాదని అన్నారు. శనివారం జరిగే బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

బోధన్: బీసీ రిజర్వేషన్ల పట్ల బీజేపీ వైఖరి స్పష్టం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం కేంద్రప్రభుత్వానికి నిరసనగా ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నూర్జహాన్, వెంకటేష్, శంకర్ గౌడ్, ఏశాల గంగాధర్, నన్నేసాబ్, గంగాధరప్ప, జంగం గంగాధర్, మల్లేష్, సాగర్ పాల్గొన్నారు.

పేకాట ఆడితే కఠిన చర్యలు

బోధన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడిన, పేకాట నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని బోధన్‌రూరల్ ఎస్ఐ మచ్చేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ మండలంలోని చిన్నమావంది గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని, పేకాట స్థావరం వద్ద రూ.4వేల స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా పేకాట ఆడిన, నిర్వహించిన చర్యలు తప్పవన్నారు.

ముప్కాల్ నూతన ఎంపీడీవోగా డి.రమేష్



బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో

ముప్కాల్ , అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల నూతన ఎంపీడీవోగా డి. రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన బాల గంగాధర్ బదిలీపై రుద్రూర్ వెళ్లగా ప్రస్తుతం రమేష్ ఆసిఫాబాద్ జిల్లా కాగాజ్ నగర్ నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు స్వీకరించిన రమేష్‌ను కార్యాలయ సిబ్బంది శాలువతో సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తానని తెలిపారు.


విద్యార్థులకు ఓపెన్ హౌజ్‌పై అవగాహన

ముప్కాల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ముప్కాల్ పోలీస్ స్టేషన్ పోలీసల బృందం ఆధ్వర్యంలో ఓపెన్ హౌజ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం పోలీస్ బృందం వారు విద్యార్థులకు పోలీసల విధులు, ఆయుదాల ఉపయోగం, లాకప్ గదులను, రిజిష్టర్ల నిర్వహణపై అవగాహన కల్పించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్సై రజనీకాంత్‌రెడ్డి, ఏఎస్సై గంగారాం అవగాహన కల్పించారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నందిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖుద్వాన్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని గ్రామాల్లో మూడు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం సొసైటీ చైర్మెన్ వాకిడి కార్తీక్ రెడ్డి ప్రారంభించారు. తొండాకూర్, దత్తాపూర్, ఖుద్వాన్‌పూర్ గ్రామాల్లో ఒక్కటి చొప్పున కేంద్రాలు మొదలైనాయి. ఈ సందర్భంగా చైర్మన్ వాకిడి కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ ఏ గ్రేడు(దొడ్డు రకం) వరిధాన్యం క్వింటాలుకు రూ.2,389, బి గ్రేడు(సన్న రకం) వరిధాన్యం క్వింటాలుకు రూ.2,369 ధర ప్రభుత్వం చెల్లింస్తుందని తెలిపారు. కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కార్తీక్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఆ ర్మూర్ నియోజక వర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్, సొసైటీ సీఈవో ఐల చిన్నయ్య, మండల వ్యవసాయ విస్తరణ అధికారుల ఉన్నారు.

ఈవ్ టీజింగ్ సైబర్ క్రైమ్‌లపై అవగాహన



షీ టీమ్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

డొంకేశ్వర్, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి): మహిళల విద్యార్థుల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించిన ఈవ్ టీజింగ్ చేసిన షీ టీంకు సమాచా రం అందించాలని ఏఎస్సై వెంకటేశ్వర్లు సూచించారు. డొంకేశ్వర మండల కేంద్రంలోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో సైబర్ క్రైమ్ షీ టీంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈవ్ టీజింగ్‌కు గురైన వారు భయపడకుండా షీ టీంకు సమాచారం అందిస్తే వారికి రక్షణ కల్పిస్తామని తెలిపారు. ఎవరైనా విద్యార్థులను మహిళలను వేధింపులకు గురి చేస్తే షీ టీంకు సమాచారం ఇచ్చినట్లయితే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సైబర్ క్రైమ్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్ కుమార్, కానిస్టేబుల్ విగ్నేష్, సుమతి, తదితరులు పాల్గొన్నారు.

చౌట్‌పల్లి పీహెచ్‌సీ తనిఖీ

కమ్మర్‌పల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ రాజశ్రీ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని స్టోర్‌రూంలోని మందులను పరిశీలించి మందలవివరాలను, వాటి నిలువలను ఆడిట్ చేశారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయండి



లొంగన్‌లో ఇంటికి ముగ్గు పోస్తున్న అధికారులు

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ పథకం కింద మంజూరైన ఇళ్లను లబ్ధిదారులు వేగంగా నిర్మించుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని లొంగన్ గ్రామంలో పలువురి ఇళ్ల నిర్మాణానికి ఆయన ముగ్గు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లబ్ధిదారులు ఇళ్లను ప్రభుత్వం సూచించిన విధంగా నిర్మించుకుంటే విడతల వారీగా బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. దీంతో పాటుగా అదనంగా ఐకేపీ నుంచి వడ్డీ లేకుండా రూ.లక్ష రుణం ఇప్పిస్తామన్నారు. జుక్కల్ మండలంలో 617 ఇళ్లు మంజూరు కాగా, 295 ఇళ్లకు ముగ్గు వేశామని చెప్పారు. రెండు ఇళ్లు పూర్తి కాగా, 21 స్లాబ్ దశలో, 104 బేస్మిట్ దశలో, 58 పుట్టింగ్ దశలో, 32 ముగ్గు దశలో ఉన్నాయని తెలిపారు. 22 ఇళ్లు ఇంకా ప్రారంభం కాలేదని తెలిపారు. ఎంపీవో రాము, పంచాయితీ కార్యదర్శి అనురాధ పాల్గొన్నారు.

గోదాం భవనం పూర్తి.. త్వరలో ప్రారంభం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న గోదాం భవనం

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో సహకారం సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన గోదాం భవనం అందుబాటులోకి వచ్చింది. గ్రామంతో పాటు పరిసర గ్రామ రైతుల అవసరం నిమిత్తం సహకార అధికారులు రూ.20 లక్షల నిధులతో 2.50 మెట్రిక్ టన్ను సామర్థ్యం గల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. దీంతో కాంట్రాక్టర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. భవనం అందుబాటులోకి రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో జుక్కల్ ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయిస్తామని స్థానిక కాంగ్రెస్ నేతలు తెలిపారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్

బాన్సువాడటౌన్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ నియోజకవర్గంలోని పలువురు బాధిత కుటుంబ సభ్యులను డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో పనిచేస్తున్న దొన్కంటి ప్రవీణ్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఈ మేరకు ప్రవీణ్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పాతబాన్సువాడకు చెందిన వీరారెడ్డి గత కొన్ని రోజుల క్రితం ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకోగా, విషయం తెలుసుకున్న ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎన్జీవోస్ కాలనీకి చెందిన ఖయ్యూం ప్రమాదవశాత్తు గాయపడటంతో ఆయన ఇంటికెళ్లి ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలి



డ్వాక్రా సంఘాల అధ్యక్షులతో మాట్లాడుతున్న ఏపీఎం గంగారం

జుక్కల్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలాస్, కండెవల్లూరు గ్రామాల్లో త్వరలో ఏర్పాటుకానున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డ్వాక్రా సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు సద్వినియోగం చేసుకోవాలని జుక్కల్ ఏపీఎం గంగారం అన్నారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించిన అనంతరం మాట్లాడారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తేమశాతం చూసుకొని, కాంటాలు చేసుకోవాలన్నారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాలలో రైతులకు నీడవసతి, టెంట్లు ఏర్పాటుచేయాలన్నారు. అధ్యక్షులు, కార్యదర్శులు అంబవ లక్ష్మి, సీసీలు అకౌంటెంట్ స్వరూప, సంఘ సభ్యురాలు మాధవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సకాలంలో అందాలి

ఆర్మూర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు ప్రజలకు సరైన సమయంలో అందాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రైతువేదికలో శుక్రవారం 224 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు ఆర్మూర్ మార్కెట్ యార్డులో మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని పలు వార్డులలో పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధ్వంసమైన రోడ్లను పరిశీలించారు. రోడ్ల మరమ్మత్తులు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని అన్నారు. ఇరిగేషన్ భూముల వద్ద కట్టడాలను ఆపివేయాలని భూమి కబ్జా కాకుండా చూడాలని అధికారులకు సూచించారు.

ఇందూరుకు వ్యవసాయ కళాశాల.. నేతల హర్షం

నిజామాబాద్, సుభాష్‌నగర్, కమ్మర్‌పల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన వ్యవసాయ కళాశాలను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్‌లో ఆమోదం తెలపడంపై జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర రైతు కమీషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

● కళాశాల మంజూరు నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ చిత్రపటాలకు శుక్రవారం కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు.

● వ్యవసాయ కళాశాల మంజూరైన నేపథ్యంలో టీయూ పూర్వవిద్యార్థి సంఘం అధ్యక్షుడు పంచరెడ్డి చరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి సీఎం, జిల్లా నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ ఆధారిత జిల్లాగా పేరుపొందిన నిజామాబాద్ జిల్లాలో వ్యవసాయ కళాశాల వల్ల అనేక పరిశోధనలు జరిగి నూతన విప్లవానికి నాంది పలుకుతుందని అన్నారు. సతీష్, రమేష్, మీరాన్ అలీ, అయూబ్, విశాల్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పాత్ర కీలకం



నిజామాబాద్ జిల్లాకు వ్యవసాయ కళాశాల మంజూరు విషయంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పాత్ర కీలకం. గతంలో మెడికల్ కళాశాల తీసుకొచ్చిన ఆయన, ఇటీవల ఇంజినీరింగ్ కళాశాల సైతం జిల్లాకు మంజూరయ్యేలా కృషిచేశారు.

● తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్

కళాశాల మంజూరు గొప్ప విషయం



జిల్లాకు వ్యవసాయ కళాశాల మంజూరవడం గొప్ప విషయం. మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిల కృషి కూడా ఎంతో ఉంది.

● మానాల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

యువతకు ఉపయుక్తం



నిజామాబాద్ వ్యవసాయ ఆధారిత జిల్లా కావడంతో ఈ కళాశాల రైతు యువతకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఈ నిర్ణయం నిజామాబాద్ ప్రజల ఆశలను నెరవేర్చింది. అగ్రికల్చర్ కళాశాల కేటాయింపుతో రూరల్ నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు.

● భూపతిరెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే

గతంలో మంత్రికి విజ్ఞప్తి చేశా



గతంలో నిజామాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వ్యవసాయ కళాశాల మంజూరు కోసం విజ్ఞప్తి చేశా. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ వ్యవసాయ కళాశాల మంజూరులో తమవంతు పాత్ర పోషించారని, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సైతం సీఎంను కోరారని చెప్పారు. కళాశాల రాకతో రైతులకు ఎంతో ఉపయోగం.

● గడుగు గంగాధర్, రాష్ట్ర రైతు కమీషన్ సభ్యుడు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

ఐక్యతతో హక్కులు సాధించుకోవాలి

జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు పిట్ల శ్రీధర్

బాన్సువాడటౌన్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): బీసీలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు పిట్ల శ్రీధర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు శనివారం నిర్వహించబోయే బంద్‌కు అందరూ సహకరించాలని ఆయన కోరారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించాలని, ఆ దిశగా ప్రభుత్వాలు అడుగులు వేయాలని డిమాండ్ చేశారు. పార్టీలకతీతంగా బీసీలంతా ఒక్కతాటిపైకి వచ్చి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గంగాధర్, రాజులు, జీవన్, బాలకృష్ణ, లింగం, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

రైతులకు కపాస్ యాప్‌పై అవగాహన

మద్నూర్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దఎక్లారా గ్రామానికి చెందిన పత్తి రైతులకు కిసాన్ కపాస్ యాప్‌పై మండల వ్యవసాయ అధికారి రాజు శుక్రవారం అవగాహన కల్పించారు. వానకాలంలో సాగు చేసిన పత్తి పంటకు సంబంధించిన వివరాలను తప్పకుండా ఏఈవో వద్ద నమోదు చేయించాలని సూచించారు. పంట వివరాలు రాయించుకోని రైతులుంటే తమ పరిధిలోని ఏఈవోల వద్ద సరిచూసుకొని నమోదు చేసుకోవాలని సూచించారు. మొబైల్ నంబర్ కూడా సరి చూసుకోవాలన్నారు. పత్తి కొనుగోలు కొరకు ఈసారి సీసీఐ వారు పత్తి రైతులు కిసాన్ కపాస్ యాప్ ద్వారా స్లాట్‌బుక్ చేసుకొని నిర్ణయించబడిన తేదీకి మాత్రమే మార్కెట్‌కి రావాల్సి ఉంటుందన్నారు. ఈ యాప్‌ను రైతులు ప్లేస్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఏఈఓ సంపత్, రైతులు పాల్గొన్నారు.



మద్నూర్ మండలంలో రైతులకు కాపాస్ యాప్ పై అవగాహన కల్పిస్తున్న ఏవో

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రామకృష్ణపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రం లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రేమ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రప్రధాన కార్యదర్శి ప ద్మారావు, నాయకులు కామేలు, బాలయ్య, శం కర్, పోచయ్య, సాయిబాబు, కాశీరాం, యాద గిరి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

మద్నూర్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్‌పీడీసీఎల్ అధికారులు ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్తు సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని సీజీఆర్‌ఎఫ్-2 చైర్మన్ ఎరుకల నారాయణ సూచించారు. శుక్రవారం మండలంలోని మేనూర్‌లో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని మాట్లాడారు. ప్రజలు ఈ వేదికలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, డోంగ్లి మండలాల వినియోగదారులు పాల్గొన్నారు.

పంట సిద్ధమైనా.. తప్పని నిరీక్షణ

జుక్కల్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలంలోని వివిధ గ్రామాలలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన సోయాపంటను విక్రయించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం సోయా కొనుగోలు కేంద్రాలను సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో నిరీక్షణ తప్పడం లేదు. ఏటా రాష్ట్ర మార్క్‌ఫెడ్ అధికారులు సోయా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేవారు. కానీ ఈ ఏడు ఆలస్యం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేట్ మార్కెట్లో విక్రయిద్దామంటే క్వింటాల్‌కు రూ.4300 ధర మాత్రమే పలుకుతోంది. మరోవైపు ప్రభుత్వము నిర్ణయించిన ధర మాత్రం రూ.5300గా ఉంది. దీంతో ప్రైవేట్‌లో విక్రయిస్తే నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన సోయా పంట

బంద్‌కు సహకరించాలి

బాన్సువాడటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల కోసం శనివారం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని బీసీ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తూ వ్యాపార సముదాయాలను మూసిఉంచాలన్నారు. పాఠశాలలు , కళాశాలల యాజమాన్యాలు బంద్‌కు మద్దతు తెలపాలని కోరారు.

ముందస్తు దీపావళి సంబరాలు

బాన్సువాడటౌన్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం ముందస్తు దీపావళి సంబరాలను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం టపాసులు కాలుస్తూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.



సంబరాలు జరుపుకొంటున్న దృశ్యం



ఖేలో ఉత్సవ్‌లో మెడల్స్ సాధించిన విద్యార్థులు

భాగ్యనగరంలో సత్తాచాటిన బిచ్కుంద విద్యార్థులు

బిచ్కుంద , అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలోని రిపుల్స్ పాఠశాల విద్యార్థులు గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఖేలో ఉత్సవ్‌లో ప్రీమియర్ లీగ్‌లో సత్తాచాటారు. ఖో-ఖో, రన్నింగ్, త్రోబాల్, చదరంగం వంటి క్రీడలలో ఉత్తమ ప్రతిభను కనబర్చి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నిర్వాహకులు గోల్డ్‌మెడల్, సిల్వర్‌మెడల్, బ్రాంజ్ మెడల్‌లతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీఈటీ బస్వరాజ్‌పటేల్‌ను, ప్రధానోపాధ్యాయుడు గోపిని, విద్యార్థులను పాఠశాల వ్యవస్థాపకుడు అనిల్‌కుమార్ పాటిల్, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

వరి పంటలో క్షేత్రదినోత్సవం

మోర్తాడ్ , అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ వారు వరి పంటలో క్షేత్రదినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. నాణ్యమైన విత్తనం ప్రతి గ్రామానికి అనే కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సస్యరక్షణ శాస్త్రవేత్త పి. విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో ఆర్‌డిఆర్ 1200 అనే వరి రకాన్ని జిల్లాలోని అభ్యుదయ రైతులకు ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం వరి పంట కోత దశలో ఉన్నందున ఈ క్షేత్ర దినోత్సవాన్ని జరుపుతున్నామని అన్నారు. ఈ రకం వరి అధిక దిగుబడి ఇస్తుందని పురుగులు, తెగుల్లను పట్టుకుంటుందని అన్నారు. రైతులకు యాసంగిలో అనువైందని అన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రూర్ కృషిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయ్‌కుమార్ పాటు మండల వ్యవసాయాధికారి హరీష్‌కుమార్, రైతులు మహిపాల్, లక్ష్మీనర్సయ్య, జైడి గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

సుభాష్‌నగర్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): ఐరాడ్, ఈడార్‌లతో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలకు కృషి చేస్తున్నామని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. ఈ ప్రాజెక్టులో పోలీస్, రవాణా, రహదారుల శాఖ, ఆరోగ్యశాఖల సమన్వయంతో పనిచేస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టు నిజామా బాద్ జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో ప్రవేశపెట్టిన నిజామాబాద్ జిల్లా ప్రగతిపథం లో దూసుకెళ్తుందన్నారు. తెలంగాణలో ప్రథ మంగా మార్చి 23 నాటికి ప్రతి విభాగాన్ని ఈ ప్రాజెక్టుకు అనుసందానం చేసిందన్నారు. ఐరాడ్, ఈడార్‌ల అప్లికేషన్ ఉపయోగించి అత్యధిక ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించామన్నారు. తెలంగాణలో మొదటిసారిగా జిల్లాలో 50 కంటే ఎక్కువ ప్రమాద స్థలాలను సందర్శించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేయడం జరిగిందన్నారు. 200 కన్న ఎక్కువ రోడ్డు ప్రమాదాల అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిజామాబాద్ జిల్లాను మోడల్ జిల్లాగా తీసుకొని రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్రస్థాయిలో పోలీస్, రవాణా శాఖ విభాగాల అధికారులతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు.

టపాకాయల దుకాణాల్లో తనిఖీలు

సుభాష్‌నగర్, అక్టోబర్ 17, (ఆంధ్రజ్యోతి): టపాకాయల దుకాణాలను అడిషనల్ మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ శుక్రవారం ఆకస్మి కంగా తనిఖీ చేశారు. రెండు రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి' పత్రికలో 'నిబంధనలు తుస్' అనే కథనంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. గంజ్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. టపాకా యల దుకాణాల్లో వివరాలు అడిగి తెలుసు కున్నారు. ట్రేడ్ లైసెన్సులు ఉన్నా యా లేదా అంటూ వాకబు చేశారు. ట్రేడ్ లైసె న్సులు లేకుంటే చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. జనావాస ప్రాంతాల్లో దుకా ణాలు ఉండరాదని దూర ప్రాంతాలక తర లించాలని షాప్ యజమానులకు చెప్పారు.



దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

మరుగుదొడ్లు లేవు.. తాగునీరు రాదు

» కండేవల్లూర్ పాఠశాలలో విద్యార్థుల అవస్థలు
» ఆగిపోయిన అదనపు తరగతుల నిర్మాణాలు

జుక్కల్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండేవల్లూర్ గ్రామంలోని జడ్పీ పాఠశాలను సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రధానంగా బాలికలకు మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం లేదని విద్యార్థులు వాపోతున్నారు. హైస్కూల్ ఆవరణ లోనే ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నప్పటికీ విద్యార్థులకు సరైన వసతులు లేకపోవడంతో అవస్థలు తప్పట్లేదు. మధ్యాహ్నా భోజనం చేసే సమయంలో విద్యార్థులు ఇంటి నుంచే తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. శౌచాలయాలు లేకపోవడంతో బాలికలు ఇంటికి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకోవాల్సి దుస్థితి. భోజనం వంట చేసే వాళ్లకు ప్రత్యేక గది సైతం ఆరుబయటనే వంట చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు నిధులు కేటాయిస్తున్నప్పటికీ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో అభివృద్ధి పనులు జరగడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాల ఆవరణలో అదనపు తరగతి గదులు నిర్మాణ దశలో ఉండగానే పనులు ఆగిపోయాయి. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండటంతో తరగతి గదుల్లో ఇరుగ్గా కూర్చొని చదువుకుంటున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పం దించి పాఠశాలలో వసతులు ఏర్పాటు చేయాలని గ్రామ పెద్దలు అధికారులను కోరారు.



కండెవల్లూర్ గ్రామంలోని జడ్పీ హైస్కూల్

అవగాహన కల్పిస్తూ.. పాఠశాలలో నరకాసుర దహనం



జంక్‌ఫుడ్‌తో తయారుచేసిన నరకాసుర దహన కార్యక్రమ దృశ్యం

బాన్సువాడటౌన్ , అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు జంక్‌ఫుడ్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ శుక్రవారం ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ఉపాధ్యాయులు జంక్‌ఫుడ్ నరకాసుర బొమ్మను దహనం చేశారు. ప్రధానోపాధ్యాయులు లావణ్య, నరేష్, టీచర్స్ ఉన్నారు.

పెచ్చుమీరుతున్న పేకాట

- వ్యసనంగా మారుతున్న వైనం
- పెరుగుతున్న అప్పుల భారం
- కుటుంబాల్లో తరచూ గొడవలు
- పోలీసులు ఉక్కుపాదం మోపాలని విన్నపం

బాన్సువాడ రూరల్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): ఒకేసారి పేకాటలో గెలిచి డబ్బులు సంపాందించుకోవాలన్న అత్యాశతో యువకులు, మధ్యతరగతి ప్రజలు తాము కష్టపడి సంపాదించుకున్న డబ్బులను పేకాటలో పెడుతూ ఒక్క రాత్రిలోనే డబ్బులను పోగొట్టుకుంటున్నారు. పేకాటతో కుటుంబ కలహాలతో పాటు అప్పులభారం పెరిగి కటుంబాన్ని పోషించుకోలేక చాలామంది కొట్టుమిట్టాడుతున్నారు.

కుటుంబాలను కూలుస్తున్న పేకాట వ్యసనం

ఒక్కసారి గెలిస్తే అదృష్టం వచ్చిందని పేకాటలో సంతోషపడేవారు రోజురోజుకు అందులో చీకటిలో చిక్కుకొని గృహహింస, కుటుంబ కలహాలను కొని తెచ్చుకుంటున్నారు. సరదా ఆటపేరుతో మొదలైన పేకాట వ్యసనంగా మారి పెద్దమొత్తంలో డబ్బులు చేతులు మారడంతో పాటుగా యువకులు, ప్రజలు చెడుదారులు పడుతున్నారు. మూడు ముక్కలాట, రమ్మీ పేరుతో గ్రామాల్లో జోరుగా పేకాట ఆడుతూ యువత చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారు. ఇటీవల మండలం లోని హన్మాజీపేట్ గ్రామంలో పేకాట స్థావరం పై పోలీసులు దాడిచేసి 9 మందిపై కేసులు నమోదు చేసి రూ.26వేలకు పైగా స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులు ఉక్కుపాదం మోపాలి

బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్, బోర్లం, కొత్తబాద్, కోనాపూర్, దేశాయిపేట్, బుడ్మీ, పలు గ్రామాల్లో ఇటీవల బదిలీపై వెళ్లిన సీఐ మండల అశోక్ పేకాట స్థావరాలపై తనదైన శైలిలో దాడులు చేసి ఎంతటివారైనా ఉపేక్షించకుండా కేసులు నమోదు చేసి పేకాట రాయుళ్ల గుండెల్లో పరుగులు పెట్టించారు. ఇటీవల దేశాయిపేట్ గ్రామంలో పేకాట ఆడుతున్న వారిని పోలీసులు దాడి చేసి పట్టుకుని వదిలేసి నట్లు ఆరోపణలు వినిపిస్తున్నా యి. ప్రస్తుతం బదిలీపై వచ్చిన పట్టణ సీఐ తులా శ్రీధర్ బాన్సువాడలో పేకాట కట్టడికి కృషిచేసి పేదల జీవితాలను తీర్చి దిద్దేందుకు తన వంతు కృషిచేయాలని, పేకాట స్థావరా లకు అడ్డుకట్ట వేసి పేదల డబ్బుల తో ఆటలాడుతున్న వారి భరతం పట్టాలని పేకాట స్థావరాలపై ఉక్కుపాదం మోపాలని మండల ప్రజలు కోరుతున్నారు.


పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్న పోలీసులు (ఫైల్)

ప్రతిఒక్కరికి రూ.2లక్షల రుణమాఫీ చేయాలి


మాట్లాడుతున్న విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి

భిక్కనూరు, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతిఒక్క రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని మండలంలోని అంతంపల్లి విండో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. శుక్రవారం విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన విండో మహాజనస సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విండో సీఈవో ఆదాయ, వ్యయాలను సభ్యులకు చదివి వినిపించారు. అనంతరం విండో చైర్మన్ మాట్లాడుతూ.. విండో అభివృద్ధికి అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి గ్రామాల రైతులను కలుపుకొని ముందుకు సాగుతున్నామన్నారు. సోమవారం నుండి విండో పరిధిలో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. వరి ధాన్య సన్నరకంకు బోనస్ రూ.500లు చెల్లించాలని, విండోలో ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి రైతు విండో సభ్యత్వం తీసుకోవాలని తీర్మానించారు. మానిటరింగ్ అధికారి సురేష్‌కుమార్, విండో ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, డైరెక్టర్లు రాములు, గంగయ్య, ధర్మారెడ్డి, రాజిరెడ్డి, రమేష్, ఎల్లారెడ్డి, శోభసిద్దిరాంరెడ్డి, మీరి, విండో సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు

బాన్సువాడ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామానికి చెందిన పీసీసీ డెలిగేట్ వెంకట్‌రెడ్డి డీసీసీ అధ్యక్ష పదవికి శుక్రవారం దరఖాస్తు దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని సంవత్సరాలుగా పార్టీ శ్రేయస్సు కోసం పనిచేస్తున్నానని, పార్టీ అధిష్ఠానం కార్యకర్తల అభిప్రాయం కోసం అధ్యక్ష పదవికి దరఖాస్తు ద్వారా ఎంపిక చేపట్టడం అభినందనీయమన్నారు. తనకు డీసీసీ పదవి అప్పగిస్తే క్షేత్రస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించేందుకు స్థానిక ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ముందుకు వెళ్తానన్నారు.

విద్యుత్ అంతరాయం కలగకుండా బ్రేకర్

భిక్కనూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీ సిద్ధరామేశ్వర ఆలయానికి విద్యుత్ అంతరాయం కలగకుండా నూతనంగా బ్రేకర్‌ను ఏర్పాటు చేయగా శుక్రవారం ఎస్ఈ శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయలంతో పాటుగా గుర్జకుంట గ్రామానికి విద్యుత్ అంతరాయం కలగకుండా బ్రేకర్‌ను ఏఆర్పటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ చక్రవర్తి, ఏడీ, ఏఈ, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత

(5వ పేజీ తరువాయి)

వారు మాట్లాడుతూ అక్రమంగా ఆవులను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తామంతా బస్వాపూర్ వద్ద కంటైనర్ లారీని పట్టుకుని చూడగా 53 ఆవులను గుర్తించడం జరిగిందన్నారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇవ్వగానే ఏఎస్సై నర్సయ్య సిబ్బందితో అక్కడికి చేరుకుని కేసు నమోదు చేసుకుని ఆవులను మద్దికుంట గోశాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున బీజేపీ, భజరంగ్‌దళ్ సభ్యులు, స్థానిక యువకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా.. జీరో దందా!

(5వ పేజీ తరువాయి)

వస్తువును రూ.50కి విక్రయిస్తున్నారు. బ్రాండ్ కంపెనీలు కాకుండా చిన్న చిన్న కంపెనీల టపాకాయలకు ఇష్టారీతిన ధరలను ముద్రిస్తు విక్రయిస్తున్నారు. ఒకే వేబిల్లుపై ఎక్కువ టపాకాయలు దిగుమతి చేసుకుంటున్నారు. వాణిజ్య పన్నుల శాఖ అటువైపు కన్నెత్తి చూసిన దాఖాలాలు లేవు. ఏ ఒక్క బాణాసంచ హోల్‌సెల్ దుకాణాలను, గోదాంలను తనిఖీలు చేసిన దాఖాలాలు లేవు. వ్యాపారులు ఇచ్చే మామూళ్లకు తలొగ్గి సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవడం లేదని దీంతో వ్యాపారులు ఇష్టారీతిన ధరలతో విక్రయిస్తున్నారంటూ వినియోగదారులు మండిపడుతున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని వ్యాపారులు గండికొడుతున్నారు.

నిబంధనలు బేఖాతారు

జిల్లాలో టపాకాయల దుకాణాల ఏర్పాటులో వ్యాపారులు నిబంధనలు పాటించడం లేదని తెలుస్తోంది. దుకాణాలను నిర్మానుష్య ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి. స్మోకింగ్ నిషేధమని బోర్డులను ఏర్పాటు చేయాలి. పెట్రోల్ బంక్‌లు సమీపంలో లేకుండా చూసుకోవాలి. రెండు దుకాణాల మధ్య 3 మీటర్ల గ్యాప్ ఉండేలా చూడాలి. విద్యుత్ షాక్ తగులకుండా ఎలక్ట్రిసిటీని జాగ్రత్తగా వైరింగ్ చేయాలి. రెండు వాటర్ బ్యారళ్లను ఒక్కో దుకాణం వద్ద ఏర్పాటు చేసుకోవాలి. డీసీపీ ఫైర్ సిలిండర్‌లను ఏర్పాటు చేయాలి. ఈ నిబంధనలను ఏవి కూడా పాటించడం లేదు. కామారెడ్డిలో నిత్యం రద్దీగా ఉండే పక్కనే కూరగాయల మార్కెట్ ఉండే ప్రాంతంలోనే బాణాసంచా స్టాళ్లను ఏర్పాటు చేశారు. కామారెడ్డిలోనే కాకుండా ఎల్లారెడ్డి, బాన్సువాడల్లోనూ జన సముదాయం ఉన్న ప్రాంతాల్లోనే నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారని పలు ఆరోపణలు వస్తున్నాయి.

హమాలీల పొరపాటుతోనే అధిక బరువు


మొక్కజొన్న కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

భిక్కనూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): హమాలీలు చేసిన పొరపాటు కారణంగానే ఒక్కో బస్తాలో 12కిలోల మొక్కజొన్న ఎక్కువగా వచ్చిందని మండలంలోని గుర్జకుంట రైతులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. తాము గత కొన్నేళ్లుగా గుర్జాల్‌కు చెందిన వ్యాపారులకు మొక్కజొన్న విక్రయిస్తున్నామన్నారు. గతంలో ఎప్పుడూ ఇలా కలేదని కేవలం నమ్మకంతో పంపిన హమాలీలే వ్యాపారికి నమ్మక ద్రోహం చేసినట్లు గుర్తించామన్నారు. వ్యాపారి తమను క్షమాపణ కోరినట్లు తెలిపారు. ఇక నుండి పట్టుబడిన హమాలీలను పంపించొద్దని రైతులు ఏకగ్రీవంగా తీర్మాణం చేసిన అనంతరం కొనుగోలు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సరస్వతి శిశుమందిర్‌లో కబడ్డీ టోర్నీ

కామారెడ్డిటౌన్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఆది, సోమవారాలలో కబడ్డీ టోర్నీ నిర్వహించనున్నట్లు టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు భాస్కర్, రాజు తెలిపారు. మొదటి బహుమతి రూ.20వేలు, రెండో ప్రైజ్ రూ.10 వేలు, మూడో బహుమతిగా రూ.5 వేలు గెలుపొందిన క్రీడాకారులకు కప్, ప్రైజెస్ ఇస్తామన్నారు. ఈ క్రీడ మ్యాట్‌పైన నిర్వహిస్తారని, షూస్, డ్రెస్‌కోడ్ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. వివరాలకు 9989215251, 9440037833 సంప్రదించాలన్నారు.

తాడ్వాయి నూతన ఎస్సైగా నరేష్

తాడ్వాయి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి ఎస్సైగా నరేష్ బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు పనిచేసిన ఎస్సై మురళి కామారెడ్డికి బదిలీపై వెళ్లారు. కామారెడ్డిలో పని చేస్తున్న ఎస్సై తాడ్వాయికి వచ్చారు.

విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన

లింగంపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడే కీలకమైన కార్డియో పల్మనరీ రిసెసిటేషన్ (సీపీఆర్) ప్రక్రియపై లింగంపేటలోని పాఠశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో 108 అంబులెన్స్ సిబ్బంది పాల్గొని విద్యార్థులకు సీపీఆర్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఈఎంటీ కృష్ణమూర్తి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై ప్రాథమిక జ్ఞానం కలిగి ఉండాలని, తద్వారా ఆపదలో ఉన్నవారికి తక్షణ సహాయం అందించి, వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని, సీపీఆర్ పద్ధతులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పైలెట్ శ్రీనివాస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న 108 సిబ్బంది

● కామారెడ్డిటౌన్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): సీపీఆర్ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం 108 సిబ్బంది కృష్ణస్వామి, విజయ్‌కుమార్‌లు కొత్తబస్టాండ్‌లో డ్రైవర్‌లు, కండక్టర్‌లకు సీపీఆర్‌పై అవగాహన చేపట్టారు.గుండెపోటు వచ్చి వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు ఎలా గుర్తించాలని, సీపీఆర్ ఎన్నిసార్లు చేయాలనే దానిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని తెలిపారు.


విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

ఇస్రో సందర్శనకు విద్యార్థినుల ఎంపిక

తాడ్వాయి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సందర్శనకు తాడ్వాయి మండలం కృష్ణాజీవాడి ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టాప్ 30 విద్యార్థినులకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ జిల్లా స్థాయిలో పోటీ పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షల్లో పాఠశాలకు చెందిన కుమ్మరి అక్షర, కుమ్మరి తరణిలు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ విద్యార్థినులు మరెన్నో విజయాల సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిర్మబోయి, నీల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా కళాశాలకు రావాలి

తాడ్వాయి, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిలు నిర్భయంగా కళాశాలకు రావాలని షీటీం ప్రతినిధులు తెలిపారు. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులకు శుక్రవారం షీటీం ప్రతినిధులు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులను ఎవరైనా వేధించినా, ఇబ్బందులు పెట్టినా వెంటనే షీ టీంకు సమాచారం అందించాలని సూచించారు. షీ టీం సభ్యులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ యూసుఫ్ హుస్సేన్, ఎన్ఎస్ఎస్ ఇంచార్జి శ్రీకాంత్, షీ టీం ప్రతినిధులు సుప్రజ, శ్రీశైలం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

427 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

(5వ పేజీ తరువాయి)

కేంద్రాల వద్ద రైతులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలని, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆయన సొసైటీల సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 427 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, అందులో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 233 కేంద్రాలను, ఐకేపీల ఆధ్వర్యంలో 194 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో ఐదు లక్షల 99 వేల 212 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అంచనా వేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తరలిస్తున్నారని, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టాక తేమ శాతం పరిశీలించిన తరువాత సిబ్బంది ధాన్యాన్ని తూకం వేస్తారని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయడం ప్రారంభమవుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు ఎలాంటి జాప్యం జరగకుండా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల్తుమ్మెద సొసైటీ సీఈవో సందీప్, తాండూర్ సొసైటీ సీఈవో చంద్రమురళీ తదితరులు పాల్గొన్నారు.

నేటి బంద్‌కు బీఆర్ఎస్ మద్దతు

లింగంపేట, దోమకొండ, కామారెడ్డి టౌన్, సదాశివనగర్ అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని శనివారం చేపడుతున్న రాష్ట్రవ్యాప్త బంద్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు తెలిపిందని బంద్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు రమేష్ పిలుపునిచ్చారు.

● రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ నాయకులు కోరారు బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు అబ్రమైన రాజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటుచేసిన పత్రిక సమావేశంలో మాట్లాడారు.

● బీసీ బంద్‌కు అన్నివర్గాలు సహకరించాలని బీసీజాయింట్ యాక్షన్ కమిటి సభ్యులు కోరారు. ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 42శాతం బీసీ రిజర్వేషన్‌లను అమలుచేయాలని బీసీ ఐక్యవేదిక ఇచ్చిన బంద్‌కు వ్యాపార,వాణిజ్య, విద్యాసంస్థలు, హోటల్‌లు,బార్ అండ్ వైన్స్‌లు ఇతరఅన్ని దుకాణాలు సహకరించాలని కోరారు. మరో వైపు పట్టణ ముదిరాజ్‌సంఘం సైతం మద్దతు ప్రకటిస్తుందని పట్టణ అధ్యక్షుడు దాదేబాలరాజు, ప్రధానకార్యదర్శి భానుప్రకాష్‌లు తెలిపారు.

● బీసీ సంఘాలు చేపడుతున్న రాష్ట్ర బంద్ కార్యక్రమానికి బీసీటీయూ సంపూర్ణ మద్దతు అందిస్తుందని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లోనే కాకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లోను కల్పించాలని డిమాండ్ చేశారు.

నాగమడుగుపై కమీషన్ల పడగ

(5వ పేజీ తరువాయి)

కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం కాలువల కోసం భూసేకరణ చేయడం లేదని, సర్కారుపై ఒత్తిడి తేవడంలో సదరు ప్రతినిధి విఫలమయ్యారని తెలుస్తోంది. ఈ ఎత్తిపోతల పథకం 40 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఐదేళ్లు దాటినా ప్రాజెక్టును పూర్తి చేయడంలో, పనులను వేగిరం చేయడంలో బాధ్యత కలిగిన 'నేత' పట్టింపులేనట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాగమడుగు ఎత్తిపోతల పథకం కరకట్టతో పాటు పంప్‌హౌజ్‌లు, గ్రావిటీ కాలువ నిర్మాణానికి 500 ఎకరాల భూములు అవసరమని నీటిపారుదల అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు అవసరమైన భూమిని సేకరించలేదు. మార్కెట్ ధరకు అనుగుణంగా తమకు పరిహారం దక్కడం లేదనిరైతులు తమ భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. ఎకరానికి రూ.30 లక్షల వరకు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఒడ్డేపల్లి శివారులో సేకరించిన భూమికి ఎకరానికి రూ.17లక్షల చొప్పున పరిహారం చెల్లించారు.

ప్రాజెక్టుకు పర్సంటేజీల పాపం

ప్రాజెక్టు నిర్మాణం కోసం టెండరు దక్కించుకున్న సంస్థ తొలి రోజుల్లో పనులు వేగంగానే నసాగాయి. అయితే ప్రభుత్వం మారిన తరువాత స్థానికంగా కుర్చీ ఎక్కిన ఓ పెద్దమనిషి వల్ల పనులకు ఆటంకాలు కలిగాయని స్థానికులు అనుకుంటున్నారు. పనుల పరోగతిని సమీక్షించడానికి నిర్మాణ సంస్థ ప్రతినిధులను పిలిపించుకున్న నేత తనకు రావాల్సిన మేత కోసం పేచీ పెట్టినట్లు విమర్శలు ఉన్నాయి. కనీసం 20 శాతం నుంచి 30 శాతం వరకు ముడుపులు చెల్లించాల్సిందే అని మొండికేసినట్లు తెలిసింది.

సీఎంకు చేరిన పంచాయితీ...

40 వేల ఎకరాలకు నీరందించే మంచి ఉద్దేశ్యంతో ప్రారంభించిన నాగమడుగు ప్రాజెక్టుకు ఆదిలోనే ఇబ్బందులు ఎదురయ్యాయి. మంచి నాణ్యత, భారీ యంత్రాలతో నిర్మాణాన్ని ప్రారంభించిన టెండరు దక్కించుకున్న కంపెనీని కమీషన్లు డిమాండ్ చేయడంతో వారికి మింగుడు పడలేదు. జాతీయస్థాయి సంస్థ కావడంతో విషయాన్ని అప్పట్లో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పనులు ప్రారంభించడానికి ప్రయత్నించగా తిరిగి ఆటంకాలు కలిగించడంతో సీసీ వర్కులు ఎక్కడివక్కడే ఆగిపోయాయి.

ఇసుకకు బ్రేక్...

ప్రాజెక్టు నిర్మాణాన్ని తాను అడ్డుకోవడం లేదని, తాను అభివృద్ధిని ప్రోత్సహిస్తానని చెప్పుకోవడంలో ముందుండే నియోజకవర్గ బాస్ తన అనుచరులను రంగంలోకి దింపినట్లు తెలుస్తోంది. వారు ప్రాజెక్టు నిర్మాణానికి కావాల్సిన ముడి సరుకు దొరకకుండా చేశారని, దీంతో పనులు నిలిచిపోయాయని తెలుస్తోంది. ప్రధానంగా ఇసుక కాంట్రాక్టర్లు ఎవరూ నాగమడుగు పనులకు ఇసుక సరఫరా చేయవద్దని హెచ్చరించారని, దీంతో ప్రాజెక్టు నిర్మాణం అర్థాంతరంగా ఆగిపోయిందని రైతులు అంటున్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కానిస్టేబుల్
ప్రియ 35- కాంతార
దర్శన్- మిరాయి

బాన్సువాడ

మహేశ్వరి	ఓజీ
వెంకటేశ్వర	కాంతారా

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.150
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230

ఇళ్ల నిర్మాణపనులు వేగవంతంగా చేసుకోవాలి

సదాశివనగర్, భిక్కనూరు, బాన్సువాడ అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పనులను వేగవంతంగా పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి సతీష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని సజ్జనాయక్ తాండాలో ఏడుగురు లబ్ధిదారులకు ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాలను అనుసరించి నాలుగు దశలలో ఇళ్ల బిల్లులు అందించడం జరుగుతుందని, పనుల పురోగతిపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. అనంతరం ప్రొసీడింగ్ అందజేసిన ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ సంగ్యానాయక్, మాజీ సర్పంచ్ సురేందర్ నాయక్‌పాల్గొన్నారు.

● ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాలను వేగవంతంగా పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ భిక్కనూరు మండల అధ్యక్షుడు తిరుపరి భీంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటిని నిర్మించుకుని సకాలంలో బిల్లులు పొందాలని, ఇంటి నిర్మాణంలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామశాఖ అధ్యక్షుడు సిద్దరాములు, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు జీవన్, నాయకులు స్వామి, చందు, సిద్దరాములు, బాబు, పాల్గొన్నారు.

● బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించాలని సూపరింటెండెంట్ ముజాహిద్ అన్నారు. శుక్రవారం గ్రామంలో ఇళ్లు మంజూరైనప్పటికీ ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి వారికి అవగాహన కల్పించారు.


సజ్జనాయక్ తాండాలో లబ్ధిదారులకు ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న మండల ప్రత్యేక అధికారి


బస్వాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు